www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023
5
అన్నమయ్య





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ముంచిన 'మిచౌంగ్'



రైల్వేకోడూరులో నేలకొరిగిన అరటి పంట

ఉమ్మడి జిల్లాలో మిచౌంగ్ తుపాన్ బీభత్సం సృష్టించింది. కడప, అన్నమయ్య జిల్లాల్లో వేలాది ఎకరాలకు అపార నష్టాన్ని కలిగించింది. నీట మునిగిన వ్యవసాయ పంటలు, నేలకొరిగిన ఉద్యాన పంటలు, ఉద్ధృత రూపం దాల్చిన వాగులు, వంకల ధాటికి రైతాంగంలో నిర్వేదం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాల్లోని పదుల సంఖ్యలో చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. రైల్వేకోడూరులో 355 మి.మీ, కడప జిల్లాలోని ఒంటిమిట్టలో 142 మి.మీ గరిష్టంగా వర్షపాతం నమోదైంది. తుపాన్ దాటికి వ్యవసాయ, ట్రాన్స్‌కో, రెవెన్యూ, ఆర్అండ్‌బి శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లింది.



రాయచోటిలో నేలకొరిగిన వరి పంట



ఓబులవారిపల్లె వద్ద తెగిన వంతెన

17,638 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

5,254 ఎకరాల్లో నేలకొరిగిన ఉద్యానం

నీట మునిగిన వరి, అరటి, మినుము పంటలు

రైల్వేకోడూరులో 355 మి.మీ. వర్షపాతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలో17,638 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మూడు రోజుల కిందట పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాన్ సోమ, మంగళవారాల్లో జిల్లాపై ప్రభావాన్ని చూపించింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కడప జిల్లాలో 12,384 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 1101 ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని 36 మండలాల్లో 28 మండలాల్లో పెనునష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలపై పంజా విసిరింది. ఏడు మండలాల పరిధిలోని 171 మంది రైతులు సాగు చేసిన వరి, మినములు, జొన్న, మొక్కజొన్న, అరటి, మిరప, టొబాకో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అత్యధికంగా 8,939 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల విస్తీర్ణంలోని 9,687 ఎకరాల్లో వరి, మినుములు, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, మస్క్ మెలన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్య ధికంగా 1,815 ఎకరాల్లో మినుములు, 293 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాజంపేట, నందలూరు, మండలాల పరిధిలోని 20గ్రామాల పరిధిలోని 358 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో సుగర్‌కేన్, పంటలకు నష్టం వాటిల్లింది.

నేలకొరిగిన ఉద్యానం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,254 ఎకరాల్లో ఉద్యాన పంటలు నేలకొరిగాయి. తుపాన్ తీవ్రతతోపాటు గాలుల బీభత్సం ధాటికి పండ్ల తోటలు నేల కొరగడం ఆందోళన కలిగి ంచింది. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, చింత కొమ్మదిన్నె, సిద్ధవటం, కాశినాయన, మైదుకూరు, బి.మఠం, బద్వేల్, ఖాజీపేట, అట్లూరు మండలాల్లోని 524 మంది రైతులకు సంబంధించి 1,101 ఎకరాల్లో పండ్లతోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 899 ఎకరాల్లో అరటి రైతులే కావడం గమనార్హం. బొప్పాయి, నిమ్మ, వంగ, మిరప, టమోటా కర్బూజ, ఉల్లి, తదితర పంటలు ఉన్నాయి. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలో 4, 153 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం రాజంపేట, చిట్వేలి, కోడూరు, ఓబులవారిలిపల్లి, పెనగలూరు పుల్లంపేట, రామాపురం మండలాల్లో పరిధిలోని 79 గ్రామాల్లోని రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అత్యధికంగా 398 ఎకరాల్లో అరటి, 87 ఎకరాల్లో బొప్పాయి, 93 ఎకరాల్లో బీటల్‌వైన్ పంటలు నష్టపోయాయి. ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేయడం గమనార్హం.



చిన్నమండెంలో నీట మునిగిన టమోటా పంట

1,814.2 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి- రాయచోటి

నాలుగు రోజుల నుంచి బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను అన్నమయ్య జిల్లాను ముంచెత్తింది. ఆదివారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలో గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షం వల్ల వరి, అరటి, మిరప, చెరకు, టమోటా, బొప్పాయి చేతికొచ్చిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. చేతకొచ్చిన పంట చేయి జారిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీ సాధారణ సాగు భూమి 26238 హెక్టార్లు గాను 15,032 హెక్టార్లులో రైతులు సాగు చేశారు. తుపాను వర్షం కువరడంతో వ్యవసాయ పంటలకు సంబంధించి జిల్లాలో 153 హెక్టార్లుకు గాను రూ.170.28 లక్షలు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మదనపల్లి మండలంలో 80 హెక్టార్లు, రాజంపేట మండలంలో 10 హెక్టార్లు, నందలూరు మండలంలో 55 హెక్టార్లు వరి పంట నష్టం జరిగింది. రాజంపేట మండలంలో 8 హెక్టార్లలో చెరుకు నష్టం జరిగింది. ఉద్యాన పంటలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1661.2 హెక్టార్లకు 1954 మంది రైతులు నష్టపోయారు. రూ.4049.72 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అరటి 13.2 హెక్టార్లు, బీన్స్ 4 హెక్టార్లు, చామంతి పువ్వులు 0.8 హెక్టార్లు, మ్యారిగోల్డ్ 1.2 హెక్టార్లు, టమోటా 6.4 హెక్టార్లు, కూరగాయల 0.8 హెక్టార్లు, అరటి 1557.6 హెక్టార్లు,, చామంతి పువ్వులు 1.6 హెక్టార్లు, తమలపాకు అకు తోటలు 37.2 హెక్టార్లు, బొప్పాయి 34.8 హెక్టార్లు, టమోటా 3.6 హెక్టార్లు నష్టపోయారని అధికారులు అంచనా వేశారు.

పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ధ్వంసం

తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా 33 కెవి ఫీడర్ 8,11 కె.వి. ఫీడర్ 22, 33/11 కెవి సబ్ స్టేషన్ 8, 11 కెవి పోల్స్ 23, ఎల్ టి పోల్స్ 27 నేలకొరిగాయి. రాయచోటి డివిజన్‌లో 11 కెవి పోల్స్ 3, ఎల్‌టి పోల్స్ 9, రాజంపేట డివిజన్‌లో 33 కెవి ఫీడర్ 8, 11 కెవి ఫీడర్ 4, 33/11 కెవి సబ్ స్టేషన్ 8, మదన పల్లి డివిజన్‌లో 11 కెవి ఫీడర్ 7, 11 కెవి పోల్స్ 7, ఎల్ టి పోల్స్ 3 నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. **పుల్లంపేట :** తుపాన్ ప్రభావంతో మండల పరిధిలోని అనంతంపల్లి, రంగంపల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాలలో నేలకొరిగిన అరటి పంటను కలెక్టర్ గిరీష, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం త్వరనగతిన వారి ఖాతాల్లో జమ చేయిస్తానని వారు హామీ ఇచ్చారు. దెబ్బతిన్న పంటల పరిశీలన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎంపిపి ముద్ద బాబుల్‌రెడ్డి, తహశీల్దార్ నరసింహ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పుల్లంగేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న ఈ తుఫాను ప్రభావం వల్ల ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు పుల్లంగేరు చేరుతుంది. **రైల్వేకోడూరు :** భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల దెబ్బ తిన్న అరటి, బొప్పాయ, మామిడి, తోటలను కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ప్రతి ఏడాది భారీ వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పంట కోతకు వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని వారిని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని వారు పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులు కలెక్టర్‌కు వివరించారు, పంట నష్టం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు. పంట నష్టం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమన వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, తహశీల్దార్ రామ్మోహన్, నరసింహ, పుల్లారెడ్డి, ఎంపిడిఒ విజయరావు, రఘు పాల్గొన్నారు. మండలంలో 349 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. **నందలూరు :** మండలంలో వర్షానికి అరటి, వరి పండించిన రైతులు తీవ్రంగా నష్ట పోయారు. వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా ఆగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాటూరు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 80 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. నందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గాపురం గ్రామంలోని రైతు కనకరాజుకు చెందిన నాలుగు ఎకరాలలోని 6 వేల అరటి చెట్లు నేలకొరిగాయి. ఆడపూరు పంచాయితీ పరిధిలోని మర్రిపల్లె గ్రామంలో రైతు కొండా సుబ్బరాయుడు తన ఐదు ఎకరాలలో వేసిన వరి నారు నీట మునిగి రూ.20 వేలు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లంరాజుపల్లెలో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోవడంతో ఆ గ్రామ సర్పంచ్ గీతాల శిరీష రెడ్డి, గీతాల నరసింహారెడ్డి యుద్ధప్రాధిక పదిన కూలిన చెట్టును తొలగించి, విద్యుత్తును సరఫరా చేయించారు. **వీరబల్లి:** తుపాన్‌తో మండలంలో అరటి, బొప్పాయి, పూల తోటలు, దెబ్బతిన్నాయి. గడికోట పంచాయతీ ఎడబల్లి, మాధవండ్లపల్లి, రెడ్డివారిపల్లి, పేరయ్యగారిపల్లి, పెద్దూర్ కస్బా, వేల్పులమిట్ట పలు ప్రాంతాల్లో, 28 ఎకరాల్లో బొప్పాయి, 34 ఎకరాల్లో అరటి, 5 ఎకరాల్లో వరి, నష్టం వాటిల్లింది. మూడు ఇండ్లు పడిపోయినాయి. **బి.కొత్తకోట :** మండలంలోని జనుపువారిపల్లిలో శ్రీరాములు అనే రైతు ఎకరా పొలంలో మొక్కజొన్న సాగుచేశాడు. తుపాన్ ప్రభావంతో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగిందని, రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లిందన్నారు.



పుల్లంపేటలో నేలకొరిగిన అరటిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పాఠశాల ప్రహరీ కూలి దూడ మృతి

పీలేరు: పాఠశాల ప్రహరీ కూలి పేయదూడ మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటుచేసుకుంది. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మంగళవారం మేళ్లచెరువు కస్బాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిన ఘటనలో పేయదూడ మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టి కూలిన గోడను తొలగించి, శిథిలాల కింద నిర్జీవమై పడి ఉన్న దూడను వెలికి తీశారు.

సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

తుపాను ముంచుకురావడంతో అన్నమయ్య జిల్లాలో ప్రజానీకం, ముఖ్యంగా రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోందని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి కోతల సమయంలో వర్షాలు కురవడంతో మదనపల్లె, పీలేరు, తంబళ్ళపల్లి ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగిందని తెలిపారు. మొలకలు వచ్చి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో అరటి తోటలు నేలకొరిగి రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన, మొలకెత్తిన వరి ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లు చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలబడి అవసరమైన సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



పీలేరులో దూడపై కూలిన గోడ శిథిలాలను తొలగిస్తున్న గ్రామస్తులు



పుల్లంపేటలో నేలకూలిన అరటి తోట వద్ద రైతులు



నందలూరు : మర్రి పల్లెలో నీట మునిగిన వరి నారు

పకడ్బందీగా పంట నష్టం అంచనా : కలెక్టర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని పకడ్బందీగా అంచనా వేసి వెంటనే నివేదికలు పంపాలని కలెక్టర్ గిరీష ఉద్యాన, వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంచం సుకుమార్‌రెడ్డి రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలన్నింటికీ నష్టపరిహారం ఇస్తామని తెలిపారు. జిల్లాలోని ఉద్యాన, వ్యవసాయ అధికారులు అందరూ ఈరోజు నుంచే పంట నష్టం అంచనా వేసి వెంటనే నివేదికలు పంపాలన్నారు. జిల్లాలో దాదాపు రూ.40 నుంచి రూ.50 కోట్ల వరకు పంట నష్టం జరిగినట్లు అంజనా వేశామన్నారు. ప్రస్తుతం నేటి వరకు 2700 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. పది రోజుల లోపల పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు సమన్వయంతో జిల్లా మొత్తం తిరిగి పట్ట నష్టాన్ని పగడ్బందీగా అంచనా వేసి నివేదికలు తమకు పంపాలన్నారు. ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పంట వేసి నష్టపోయిన రైతులెవరూ ఆందోళన చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా రైల్వేకోడూరు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా అరటి, బొప్పాయి పంటలకు నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. రైల్వేకోడూరు నియోజక వర్గంలో ఒక ఎకరా కూడా మిస్ కాకుండా పంట వేసి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు కేవలం ఒక రైల్వేకోడూరు నియోజకవర్గంలోనే రూ.30 కోట్ల వరకు పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. త్వరలో పంట నష్టం నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపి రైతులందరికీ పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలలో తుపాను దాటికి పడిపోయిన అరటి పంటను కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, మూడు మండలాల తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారస్తులకు, బ్యాంక్ దోపిడీదారులకు కొమ్ముకాస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మోడీ ప్రభుత్వానికి దించుదాం దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ముందుకెళ్లాలని చెప్పారు. ప్రజాస్వామ్యం రాజ్యాంగం బిజెపి పరిపాలనలో ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. అన్నదమ్ములలా కలిసి ఉండాల్సిన దేశ ప్రజల మధ్య బిజెపి, ఆర్ఎస్ఎస్ కూటమి మత విద్వేషాలను చిచ్చు రాజేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలని, ఓడరేవులను ఆఖరికి వ్యవసాయం సైతం కార్పొరేట్ వ్యక్తులకు ధారాధత్వం చేస్తుందని చెప్పారు. భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్ దిగ్గజాలు అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారు. రూ. 12 లక్షల కోట్ల కుంభకోణాన్ని హెడెన్ బర్గ్ సంస్థ బయటపెట్టినా దానిపై ఇంతవరకు విచారణ చేయని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. గ్యాస్, విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుల జీవనాన్ని పాతాళంలోకి తొక్కిందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీని సైతం అటకెక్కించిందని వాపోయారు. మహిళలకు, రక్షణ లేదు పేదలకు, గిరిజలకు, సంక్షేమానికి ఫలాలు శూన్యమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని మరిచిపోయి ప్రజలను మరొకసారి మోసం చేయడం కోసం 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల పైన లక్షలాది రూపాయలను అప్పు భారం వేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీరని ద్రోహం చేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు ప్రజలపై భారాలు వేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని పేర్కొన్నారు. కేంద్రం డైరెక్షన్‌లో చెత్త పన్ను, ఆస్తి పన్ను, కరెంటు ఛార్జీల పేరిట భారాలు వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం, జనసేన వంటి పార్టీలు బిజెపి విధానాలను వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. మన దేశాన్ని రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం సిపిఎం, సిపిఐ చేస్తున్న పోరాటాల్లోకి కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డి.వెంకట్రామయ్య సి రవికుమార్ పి.రాజేశ్వరి, ఎవి.రమణ కార్యదర్శులు డి.భాగ్యలక్ష్మి యస్.ఓబులమ్మ, అంగన్వాడీ గ్రామ పంచాయతీ కార్మికులు విద్యుత్ డిస్కమ్ నాయకులు కె.సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - రాయచోటి



జాబితా విడుదల చేస్తున్న డిసిసి అధ్యక్షులు అల్లాబకష్

జిల్లాలోని 6 నియోజకవర్గాలలోని మొత్తం 36 మండలాలకు నియమితులైన మండల అధ్యక్షుల జాబితాను మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకష్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో మండల అధ్యక్షులు పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేడర్లు ఉన్న, లేకున్నా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమా నులందరూ రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని లక్ష్యంతో ముందుకు దూసుకు వెళ్తూ కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపా ధ్యక్షుడు కత్వాల్ మహ్మద్‌రఫీ, జిల్లా డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నక్రిష్ణ జిల్లా మీడియా చైర్మన్ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు దర్బార్, ఆఫ్రిన్, నియోజకవర్గం మండల అధ్యక్షులు రమణ, నూరుల్లా, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, ఖాదర్ ఖాన్,కె నాగ రాజు, ముస్తాక్, శంకర్, చంద్రబాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



పరిహారాన్ని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

మండలంలోని నూనెవారిపల్లె వద్ద ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు శ్రీనివాసులుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియాను మంగళవారం చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఎం.జనార్ధన్ రెడ్డి మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనపై వెంటనే స్పందించి సహాయం అందించిన విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మృతుడి తల్లి, వారి బంధువులు పోలా శ్రీనివాసులురెడ్డి కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైసిపి నాయకులు రెడ్డిమాసి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఇవిఎం, వివి ప్యాట్స్ పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డిఒ మురళి ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఇవిఎం, వివి ప్యాట్‌లను పరిశీలించారు. సెక్టోరియల్ అధికారుల సమక్షంలో మదనపల్లెకు వచ్చిన ట్రైనింగ్ అవగాహన వివి ఫ్యాట్ మెషీన్స్‌ను పరిశీలించారు. అనంతరం సులభతర ఓటింగ్ చేసి రెసిప్ట్‌ను పరశీలించారు. సమావేశంలో తహశీల్దార్ మహబూబ్ చాంద్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, ఇతర పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న టి.ప్రణతి, ఎస్.దీపిక ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ వారు నిర్వహించిన జాతీయ స్థాయీ పోటీలలో ప్రతిభ కనపరిచి రెండవ బహుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. టెక్నోహాలిక్ 2కె 23లో భాగంగా నిర్వహించిన పోటీలలో పేపర్ ప్రెసెంటేషన్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ప్రతిభ కనపరచి గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న సరోజ్‌బాషా

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జగనన్న కాలనీలో మూడేళ్లు అవుతున్నా పూర్తికాని ఇంటి నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ సరోజ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం నాలుగవ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో నగర పంచాయతీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీలకు సంబంధించిన పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు కావలసిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా మంజూరైన కల్వర్టరు, రోడ్లు పనులను గుత్తదారులకు అప్పగిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశించారని తెలిపారు.

నేడు కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-రామసముద్రం

ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన సర్వేపై ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సర్వే చేస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అన్ని కులసంఘాలు, మేధావులు, వార్డు కార్యదర్శులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ నారా యణస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అందరూ హాజరై తమ అభిప్రా యాలను తెలపాలని కోరారు. **ములకలచెరువు :** ములకలచెరువు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కులగణన రౌండ్ టేబుల్ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అశ్విని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు , జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, అన్ని కుల సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ

పంటనష్ట వివరాలు ప్రభుత్వానికి పంపాం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో 17 గ్రామాలలో పంట నష్టపోయిన పంట వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు మండల వ్యవసాయ అధికారి మండెం మురళీధర్ పేర్కొన్నారు. వరి 480 హెక్టార్లు, వేరుశనగ 2200 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు తెలిపారు. జిల్లాలో 18 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని కరువు మండలాలకు వెంటనే ప్యాకేజిని ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి సద్దల భాస్కర్ పేర్కొన్నారు. వరి, వేరుశనగ సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 7న కేంద్ర కరువు బృందం పర్యటించనున్న నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు మేలు జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు.



జెసిబితోపూడిక తీయిస్తున్న శేఖర్‌రెడ్డి

కాలువలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పోలి చెరువుకు వరద నీరు చేరవేసే ఊటుకూరు వద్ద గల ప్రధాన కాలువలో చెట్లు, చెత్తా-చెదారం అడ్డుపడటంతో విషయం తెలుసుకున్న ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి హుటాహుటిన కాలువ వద్దకు చేరుకొని జెసిబి సాయంతో తూములో ఉన్న అడ్డు తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువన పుల్లంగేరు నుంచి వస్తున్న వరద నీరు పోలి చెరువుకు ప్రశాంతంగా ప్రవహిస్తోందన్నారు. పోలి చెరువు నిండితే చెరువు కింద ఉన్న వందాలది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు.

నేడు ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-కలకడ

ముస్లిం మైనార్టీ ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి సాదిక్‌అలీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడలో ముస్లిం మైనారిటీ టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలనను ఎండగట్టి, ముస్లిం మైనారిటీ ఐక్యత కోసం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పీలేరు పట్టణంలో జరగనున్న సదస్సుకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్‌బాషా, వాయల్పాడు టిడిపి యూత్ చాను, రిజ్వాన్, మస్తాన్ ,మౌలా ,వై.జిలానిబాషా, నౌషాద్, కరీముల్లాబాషా, ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, జిరాక్స్ అలీ పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల విజయమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులతో కలిసి పనిచేయాలని మంత్రి, ఎంపీలు తనను ఆదేశించినట్లు పంచాయితీ రాజ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిలను కలిసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు రానున్న ఎన్నికల్లో పీలేరు మండలంతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ వైసిపి అభ్యర్థుల గెలుపుకు గట్టిగా కృషి చేయాలని ఆదేశించారని అన్నారు.అభివృద్ధి సంక్షేమ పథకాల నిర్వహణపై తనతో చర్చించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



మంత్రి, ఎంపీలతో హబీబ్‌బాషా

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు డిమాండ్ చేశారు. మంగళవారం తుపాను వలన నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు జగన్ మోహన్ రాజు టిడిపి నాయకులతో కలిసి మండల పరిధిలోని కొమ్మివారిపల్లె ఆకేపాడు, హస్తవరం, శవన వారిపల్లె తదితర గ్రామాలలో పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకొని వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాన్ బీభత్సంతో జిల్లాలో సుమారు పదివేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు 60 నుంచి రూ.75 కోట్లలో ఉంటుందని వివరించారు. జిల్లాలో ముఖ్యంగా రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలలో అరటి, బొప్పాయి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. గతంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం అందిస్తే చంద్రబాబు హయాంలో రూ.30వేలు అందించడమే కాక పంట పెట్టుబడికి వాస్తవిక గాణాంకాలతో సహాయ సహకారాలు అందించి రైతుబంధుగా పేరుగాంచాడని అన్నారు. పేరు గొప్ప- ఊరు దిబ్బ అన్న చందంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మిచౌంగ్ తుఫాన్ వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించిన పాపాన పోలేదని అన్నారు. పాలకులు గానీ, అధికార యంత్రాంగం గానీ రైతుల గోడు పట్టించుకోకుండా తమ కార్యాలయాలలో కూర్చొని గాలిలో లెక్కలు వేసి నివేదికలు సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి తీరా పంట చేతికందే సమయానికి తుపాను రూపంలో తమ ఆశలను బుగ్గిపాలు చేసిన రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలబడాలని అన్నారు. అధికార యంత్రాంగం, పాలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను నేరుగా పరిశీలించి ఎంతమేర నష్టం వాటిల్లిందో అంచనా వేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, మహిళా నాయకురాలు పత్తిపాటి కుసుమ కుమారి, మండలపార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, మాజీ జడ్‌పిటిసి చలమ య్యయాదవ్, సుబ్రహ్మణ్యంనాయుడు, నరసయ్య పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : ఒకవైపు అతివృష్టి మరోవైపు అనావృష్టితో అన్నదాత కుదేలు అవుతున్నాడని.. మిచౌంగ్ తుఫాను వల్ల రాజంపేట నియోజకవర్గంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని డిఆర్‌డిఎ మాజీ



రాజంపేట : నేలకొరిగిన అరటి పంటలను పరిశీలిస్తున్న జగన్మోహన్‌రాజు

అధికారి, రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం విధిగా అన్నదాతకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

నందలూరు: మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి అని రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పాటూరు గ్రామంలో నేలమట్టమైన దాదాపు 120 ఎకరాల వరిపంటను ఆయన పరిశీలించారు. జిల్లాలో ఆరా కొరగా సాగు చేసిన చేతికొచ్చిన వరి పంట పూర్తిగా చేలోనే నేల కొరికిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడక్కడ సాగుచేసిన మినుము, శనగ, ఉద్యాన పంటలు నేలమట్టమయ్యాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. **మదనపల్లి:** మిచౌంగ్ తుపాను బాధితులను ఆదుకోవాలని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి డిమాండ్ చేశారు. మదనపల్లె రూరల్ మండలం అంకిశెట్టిపల్లి వద్ద జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రదాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, పట్టణ అధ్యక్షులు జగదీష్, రూరల్ అధ్యక్షులు గ్రానైట్ బాబు, రూరల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రెడ్డెమ్మ, నవాజ్, జనార్దన్ తదితరులతో కలిసి వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

ప్రజా సంక్షేమానికి సిఎం పెద్దపీట : వైసిపి



చిన్నమండెం : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో గుండ్లపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని, డిజిటల్ బోర్డుని, డిజిటల్ బోర్డ్ ని నాయకులు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం పేదప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాం న్నారు. స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో పాటు ప్రతిపల్లెకు రోడ్లు, మౌలిక వసతులు కల్పించిన ఘనత పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, నారాయణరెడ్డి ,సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, మహేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రవి నాయక్, గంట్ల సురేంద్ర పాల్గొన్నారు. **కలకడ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కదిరాయచెరువు పంచాయతీలోని సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వై నీడ్స్ ఎపి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు ప్రజలకు ప్రతి ఇంటికి అందుతున్నాయని , అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని, ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ జయచంద్ర, ప్రత్యేక అహ్వానితులు కిషోర్, నాయకులు శ్రీకాంత్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని వండాడి సచివాలయంలో వైనీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ముసల్ రెడ్డి, వైసిపి నాయకుడు రంగారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ అంజనప్పలు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు రంగా రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ చుక్క అంజనప్ప, పంచాయితీ సెక్రటరీ సునందా, డిజిటల్ అసిస్టెంట్ విజయభాస్కర్ రెడ్డి, వైసిపి నాయకులు వెంకట శివా రెడ్డి, నాగిరెడ్డి, ధనుష్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, రమంజి, చంద్ర, రమణ, మల్లయ్య, తిరుమలయ్య, రాజారెడ్డి, గృహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని నేరుగా కుటుంబ సభ్యులకు తెలియజేయడానికి ఈ నివేదిక ఎంతో ఉపయోగపడుతుందని వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభుషణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంక్షేమ పాలన కోసం జగన్‌మోహన్‌రెడ్డి మరలముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నవరత్నాల పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగు నిండాయని అన్నారు. అమ్మఒడి, రైతుభరోసా, వృద్ధాప్య పింఛన్లు, వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ చేయూత వంటి పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్న సిఎం జగన్ మరల ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సెక్రెటరీ శివనాయక్, వార్డు మెం బర్లు ఆనందరెడ్డి, వెంకటయ్య, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, విఆర్‌ఒ అల్లబకాష్, చక్రపాణి, సూరిబాబు, క్రిష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.



గాలివీడు : మాట్లాడుతున్న యధుభూషణ్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'చింతల'

ప్రజాశక్తి-కలకడ

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లికి చెందిన సాయి మోహన్ కు రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అతనికి వైద్య ఖర్చులు చేసుకున్నందుకు రూ.50 వేలు, దొడ్డిపల్లికి చెందిన జ్యోతి స్వరూప్‌కు రూ.2లక్షలు చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు వర్తింపని వారికి సిఎం సహాయనిధిని అందించి అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజా రోగ్యమే ధ్యేయంగా సిఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అర్హులైన పేదలు సిఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ



బహుదానది నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

ప్రజాశక్తి-కలకడ

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రపత్తంగా ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని సత్యవతి, బహుదానది పరివాహక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు పాఠశాలలో నదులు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో అధికవర్షాలు కురుస్తున్న తరుణంలో దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహాలు అధికంగా ఉండటం వల్ల నదులు దాటేముందు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఝురికోన ప్రాంతంలో ప్రవహిస్తున్న బహుదానది నీటి ప్రవాహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, యోగేష్, కరుణాకర పాల్గొన్నారు.

క్రీడాకారులు సత్తాచాటాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో యువత పాల్గొని తమ సత్తా చాటాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఆటల ఆడే గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు అవసరమయ్యే క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న సత్తాను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేలా ప్రొత్సహించేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడవో పరమేశ్వర్ రెడ్డి, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్, ఎపిఒ చిన్న కేశవలు, ఎపిఎం రమేశ్, సింగిల్ విండో అధ్య క్షులు వెంకటరమణారెడ్డి, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఆర్ వెంకటరమణ, బాలయ్యగారిపల్లి సర్పంచ్ విశ్వనాథ్, సెక్రటరీ బాలచంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ యశోద, శాంతాబాయి పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపిపి



బ్రిడ్జి వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సర్పంచ్ నరసింహ

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీలివ్వడమే తప్ప అమలుపరచిన దాఖలాలు లేవని రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ పేర్కొన్నారు. మంగళవారం రాజుకుంట క్రాస్ వద్ద ఉన్న రాపూరు-చిట్వేలి రోడ్డులోని లోలెవల్ బ్రిడ్జిని ఎత్తు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఈ బ్రిడ్జి లోలెవల్‌లో ఉండటంతో వరదనీటితో మునిగిపోయి రెండు జిల్లాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. మండల పరిధిలోని అనుంపల్లి, రంగసముద్రానికి పూర్తిగా జనావాసాలతో సంబంధం లేకుండా పోతుందని అన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ బ్రిడ్జిని ఎత్తు పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు ఇచ్చిన హామీ మేరకు హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం తుఫాను కారణంగా మండలంలో ముఖ్యంగా అరటి రైతులు పూర్తిగా నష్టపోయారని, త్వరితగతిన వారికి నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దాడి ఇంతియాజ్, మాదాసు నరసింహ, భరత్, రాజుగుంట గ్రామస్తులు స్థానికులు పాల్గొన్నారు.



వెలిగల్లు కుడి, ఎడమ కాలువ

కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల నిలిపివేత

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువలకు ఆగస్టు 9 నుంచి నుంచి నాలుగు నెలల పాటు 90 క్యూసెక్కుల నీటిని కాలువలు ద్వారా పంపిణీ చేసినట్లు డిఇ శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నుంచి కాలువలుకు వెళ్లే నీటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వెలిగల్లు ప్రాజెక్టులో 2.96 టిఎంసిల నీరు ఉన్నదని కాలువలకు 2.8 టిఎంసిల నీటిని మాత్రమే వదిలామని, మిగతా నీటిని రాయచోటి పట్టణం, గాలివీడు మండలానికి తాగునీటి కోసం ఉపయోగిం చనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇవిఎంలపై అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రతి ఓటరుకు ఇవిఎం యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ఓటును సులభంగా వేయగలమని తహసిల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం గుండ్లపల్లె, అన్నగారిపల్లె, గంగిరెడ్డిపల్లె పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇవిఎం యంత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యాక్టోరియల్ ఆఫీసర్ త్యాగరాజు ఇవిఎం వినియోగం, ఓటర్లు ఓటు వేసే తీరుపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌలాలి, నాయకులు ఓటర్లు పాల్గొన్నారు.


పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని పూసలకాలనీలో గుడిసెలలో నివసిస్తున్న ఇరవై కుటుంబాల పేద ప్రజలకు డాక్టర్ టిఎస్ సూర్యనారాయణరెడ్డి కుమార్తె నవిత సహకారంతో సిపిఐ ఆధ్వర్యంలో 11 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్ది గాళ్ల శ్రీనివాసులు, ప్రేమ్ కుమాం, షఫీరా, ఆంజనేయులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నేరాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

ప్రజాశక్తి - వేంపల్లె : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం నేరాంధ్రప్రదేశ్‌గా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. నూతనంగా నియామకమైన జమ్మల మడుగు పట్టణ అధ్యక్షుడు రాజేష్, జమ్మలమడుగు మండలశాఖ అధ్యక్షుడు పుష్పరాజ్ స్థానికంగా మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి విలేకరులతో మాట్లా డుతూ జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం 2022 ఏడాదిలో మహిళలపై జరిగిన నేరాల్లో దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం ఉండడం దురదృష్టకరమన్నారు



సహాయక చర్యలను పరిశీలిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

నారాయణరాజుపేటలో వరద సహాయక చర్యలు

ప్రజాశక్తి-నందలూరు

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణరాజుపేట వరదనీరు వచ్చే ప్రమాదముందని అధికారులు హెచ్చరికలు జారీచేయడంతో గ్రామంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి గ్రామ సర్పంచ్ సూర్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ కరీముల్లాఖాన్, ఇఒపిఆర్‌డి సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. రాబోవు ప్రమాదం నుంచి గ్రామ ప్రజలను సురక్షితంగా కాపాడారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, వైసిపి నాయకులు ఆర్ముగంవిశ్వనాథ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'టెక్స్‌టైల్ పార్కుకు మోక్షమెప్పుడో..?'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలోని మైలవరం మండలంలో చేనేతల ఆశాకిరణం, కలల స్వప్నమైన టెక్స్‌టైల్ పార్కు ప్రారంభమెప్పుడా అని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ ప్రశ్నించారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థలో ఉన్న భవనాలు వెక్కిరిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా టెక్స్‌టైల్స్ పార్కు భవిష్యత్ మారడంలేదన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిం దన్నారు. 2006లో ప్రారంభమైన టెక్స్‌టైల్ పార్కు నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలో 2009లో నిర్మాణం పూర్తయిందన్నారు. పార్కు ప్రారంభమైతే వేల చేనేతల కుటుం బాలకు జీవనోపాధి, వ్యాపార సంవృద్ధి లభిస్తుందన్నారు. ఎన్నికల్లో చేనేతల ఓట్లు కావాలి కానీ వారి పార్కు మాత్రం ఏర్పాటు చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ ఆశయాలు కొనసాగిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ తన తండ్రి వేసిన పునాది టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. హామీని నిలబెట్టుకోవాలని లేకుంటే రాబోవు ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మీనారాయణ, శివశంకర్ పాల్గొన్నారు.